క్లుప్తంగా

పంచాయతీ కార్యదర్శుల బాధ్యతల స్వీకరణ

నిడదవోలు రూరల్: మండలంలోని పలు పంచాయతీలకు బదిలీపై వచ్చిన కార్యదర్శులు శనివారం బాధ్యతలు స్వీకరించారు. కె.శ్రీనివాసరావు (సమిశ్రగూడెం), వి.భార్గవీదేవి (గోపవరం), కేవీ సుబ్బన్న (పందలపర్రు), జీవీ నాగరాజు (తిమ్మరాజుపాలెం), డి.రంజిత్‌కుమార్ (అట్లపాడు), కె.మారుతీశ్వరరావు (కలవచర్ల), బి.మనోజ్‌ప్రకాశ్ (రావిమెట్ల), కె.విజయరాజు (కోరుమామిడి), కె.రమేష్ (పురుషోత్తపల్లి), వై.సంధ్యారాణి (శెట్టిపేట), ఆర్.మల్లేశ్వరరావు (విజ్జేశ్వరం)లు బాధ్యతలు స్వీకరించారు.

సూర్యఘర్‌పై అవగాహన కల్పించండి

ఉండ్రాజవరం: ప్రధానమంత్రి సూర్యఘర్ పథకంపై ప్రతి ఒక్కరికీ అవగాహన కల్పించాలని మండలంలోని ప్రజాప్రతినిధులను శనివారం విద్యుత్‌శాఖ డీఈఈ శ్రీధర్ కోరారు. ఉండ్రాజవరంలో ఆయన మాట్లాడుతూ ఈ పథకం గృహ వినియోగదారులకు మాత్రమే వర్తిస్తుందన్నారు. సబ్సిడీ ద్వారా లభించే సోలార్ టాపప్ ఏర్పాటు చేసుకోవడం వలన విద్యుత్ బిల్లు తక్కువ వస్తుందన్నారు. ఇంటిపై కప్పుపై కనీసం 10 చదరపు మీటర్లు, 100 చదరపు అడుగుల స్థలంలో ఒక కిలోవాట్ సామర్థ్యం కలిగిన సోలార్ రూఫ్‌టాప్ ఏర్పాటు చేసుకోవచ్చన్నారు. సహజ సిద్ధంగా ఉత్పన్నమయ్యే సోలాల్ ఎనర్జీ వల్ల కార్బన్ ఉద్గారాలు తగ్గుతాయన్నారు. మండలంలో లైన్‌మెన్ల కొరత ఉన్న మాట వాస్తవమేనని, ఖాళీలను త్వరలో భర్తీ చేయడానికి చర్యలు తీసుకుంటామని చెప్పారు.

వైఎస్సార్ సీపీ నేత చిన్నారావుకు నివాళి

ఉండ్రాజవరం: వైఎస్సార్ సీపీ నిడదవోలు నియోజకవర్గ నాయకుడు బూరుగుపల్లి చిన్నారావు 73వ జయంతిని శనివారం ఉండ్రాజవరంలో నిర్వహించారు. ఇంటివద్ద చిన్నారావు చిత్ర పటానికి, పంచాయతీ సెంటర్ వద్ద, కచేరీ చావిడి వద్ద గల చిన్నారావు విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ సలహా మండలి మాజీ చైర్మన్ బూరుగుపల్లి సుబ్బారావు, సర్పంచ్ మెండే వెంకట్రావు, వైస్ ఎంపీపీ ఎన్.సరోజ, సొసైటీ అధ్యక్షుడు సంకురాత్రి సుబ్బారావు, ఎంపీటీసీ సభ్యుడు గాడి కిషోర్, యెల్లమిల్లి నారాయణ, నిమ్మన శ్రీనివాసు, బీఎస్సార్ యూత్ సభ్యులు పాల్గొన్నారు.

నాసిరకంగా 'మధ్యాహ్న' పథకం బియ్యం

ఉండ్రాజవరం: డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకంలో భాగంగా మండలంలోని పలు పాఠశాలలకు సరఫరా చేసిన బియ్యం నాణ్యంగా లేవని తాడిపర్రు సర్పంచ్ కె.నరేంద్ర శనివారం ఆరోపించారు. ఈ నెల 3న జరిగిన ఉండ్రాజవరం మండల సమావేశంలో చివటం ఎంపీటీసీ సభ్యుడు వేముల సత్యనారాయణతో కలసి ఈ సమస్యను తాను అధికారుల దృష్టికి తీసుకు వెళ్లినట్టు నరేంద్ర తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలకు నాణ్యమైన బి య్యాన్ని పంపిణీ చేయకపోవడంతో విద్యా ర్థులు సరిగా భోజనాలు తినలేక పోతున్నారన్నారు. విద్యాశాఖ అధికారులు పాఠశాలలను సందర్శించి మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించి, చర్యలు తీసుకోవాలని కోరారు. దీ నిపై ఎంఈవోలు సక్సేనారాజు, శారద జ్యోత్స్న లు స్పందిస్తు దసరా సెలవులు ముగిసేలోగా సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చినట్లు తెలిపారు.

వ్యవసాయ కూలీ దుర్మరణం

కొవ్వూరు: కొవ్వూరు–దొమ్మేరు మధ్య శనివారం రాత్రి సంభవించిన రోడ్డు ప్రమాదంలో బళ్ల రవి (28) అనే వ్యవసాయ కూలీ దుర్మరణం చెందాడు. మోటార్ సైకిల్‌పై వెళుతున్న రవిని గుర్తు తెలియని మరో మోటార్ సైకిల్ ఢీ కొట్టింది. దాంతో రోడ్డుపై పడిపోయిన రవి తలకు బలమైన గాయమైంది. తీవ్ర రక్త స్రావమైన అతడు అక్కడికక్కడే మృతి చెందారు. ఢీకొట్టిన మోటార్ సైకిల్‌ను కొందరు పట్టుకునే ప్రయత్నం చేసినప్పటికీ ఆగకుండా వెళ్లిపోయినట్టు చెబుతున్నారు. కొవ్వూరు పట్టణ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరిస్తున్నారు. దొమ్మేరులోని కొత్తపేట ప్రాంతానికి చెందిన మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

కార్యదర్శుల బదిలీ.. చక్కబెట్టేవారేరీ?

- మండలంలో 18 పంచాయతీలకు 14 మంది డీడీవో క్యాడర్ అధికారులు
- వారిలో 11 మంది ఇతర మండలాలకు బదిలీ
- ఒక్కో డీడీవోకు ఆరు పంచాయతీల పనిభారం
- కొత్తవారిని నియమించని ప్రభుత్వం



పెరవలి సచివాలయ భవనం

పెరవలి: స్థానిక సంస్థల పాలనను ప్రజలకు మరింత చేరువ చేసేందుకు, మరింత వేగంగా ప్రజలకు ప్రభుత్వ సేవలు అందించేందుకు మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సచివాలయ, వలంటీర్ల వ్యవస్థలను ప్రవేశ పెట్టారు. ఈ రెండు వ్యవస్థలు అందించిన సేవలు విమర్శకుల ప్రశంసలు కూడా అందుకున్నాయి. ప్రస్తుత కూటమి పాలకుల పనితీరు అందుకు భిన్నంగా ఉంది. వారు తీసుకుంటున్న నిర్ణయాలు పంచాయతీరాజ్ వ్యవస్థ స్ఫూర్తిని దెబ్బతీసేలా ఉన్నాయి. పెరవలి మండలంలో పంచాయతీ కార్యదర్శుల బదిలీల విషయంలో ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలే ఇందుకు చక్కని ఉదాహరణ.

ఇదీ పరిస్థితి..

పెరవలి మండలంలో 18 గ్రామ పంచాయతీలు ఉండగా వాటి నిర్వహణ బాధ్యతలు 18 మంది కార్యదర్శులు చూస్తున్నారు. పంచాయతీరాజ్ ఉద్యోగుల బదిలీలకు రాష్ట్ర ప్రభుత్వం ఇటీవలే గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. మండలం నుంచి 13 మంది కార్యదర్శులు బదిలీ కోసం దరఖాస్తు పెట్టుకోగా, వారందరికీ బదిలీ ఉత్తర్వులు వచ్చాయి. కానూరు, పెరవలి, తీపర్రు, కండిపాడు, ఖండవల్లి–2 పంచాయతీ కార్యదర్శులు మినహా మిగతా వారందరూ బదిలీ అయ్యారు. ఇంతవరకూ బాగానే ఉంది. ఈ 13 కార్యదర్శుల స్థానంలో వేరే మండలాల నుంచి కొత్త వారిని ఎవరినీ బదిలీపై నియమించకపోవడం విశేషం. ఇక మండలంలో మిగిలిన గ్రేడ్–2 కార్యదర్శులు ముగ్గురు, గ్రేడ్ –5 కార్యదర్శులు ఇద్దరు మాత్రమే మిగిలారు. దీంతో గ్రేడ్–2 కార్యదర్శుల (డీడీవో)పై 18 గ్రామ పంచాయతీల పని భారం పడనుంది. మొత్తం 18 పంచాయతీ కార్యదర్శుల్లో 14 మంది డ్రాయింగ్ అండ్ డిస్పాచ్ ఆఫీసర్ (డీడీవో) క్యాడర్ అధికారులు. వారికి మాత్రమే చెక్ పవర్ ఉంటుంది. ఈ బదిలీల పుణ్యమా అని కేవలం ముగ్గురు డీడీఓలు మాత్రమే మండలంలో మిగిలారు. దాంతో ఒక్కో డీడీఓకు ఆరు పంచాయతీల చొప్పున భారం పడనుంది. ఉన్నతాధికారులకు ముందు చూపు లేకపోతే వ్యవస్థ అస్తవ్యస్తం అవుతుందనేందుకు ఈ ఉద్యోగుల బదిలీల వ్యవహారమే ఓ ఉదాహరణ.

రిలీవ్ ఆర్డర్ల కోసం ఒత్తిడి..

బదిలీ ఉత్తర్వులు అందుకున్న పంచాయతీ కార్యదర్శులు తమకు వెంటనే రిలీవ్ ఆర్డరు ఇవ్వాలని కార్యాలయ సిబ్బందిపై ఒత్తిడి తెస్తున్నారు. దాంతో ఏం చెయ్యాలో సిబ్బందికి తెలియని పరిస్థితి ఏర్పడింది. ఒకవేళ వారిని రిలీవ్ చేస్తే, వారి స్థానంలో విధులు నిర్వర్తించే అధికారులు ఎవరనేది ప్రశ్న. మరోపక్క బదిలీపై వెళ్లిపోతున్నామనే ఉద్దేశంతో కార్యదర్శులు రికార్డులు అప్‌డేట్ చేసి కొత్తగా వచ్చేవారికి ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నారు. కాగా గ్రామాల్లో పారిశుధ్య నిర్వహణ పనులను చక్కబెట్టే వారు కరవయ్యారు. వీధులు చెత్తతో నిండి దుర్వాసన వేస్తున్నాయని గ్రామీణులు విమర్శిస్తున్నారు. వైఎస్ జగన్ ప్రభుత్వం ప్రభుత్వ సేవలు ప్రజలకు సత్వరమే అందాలనే ఉద్దేశంతో సచివాలయ వ్యవస్థను తీసుకువచ్చి అందుకు అవసరమైన సిబ్బందిని నియమించింది. ప్రస్తుత కూటమి ప్రభుత్వం దానిని నిర్వీర్యం చేసింది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు మేల్కొని మండలంలో బదిలీ అయిన కార్యదర్శుల స్థానంలో కొత్తవారిని నియమించాలని ప్రజలు కోరుతున్నారు.

నాథుడు లేని మండల పరిషత్

ఇప్పటికే మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ పోస్టు ఖాళీగా ఉంది. మూడు నెలల పాటు ఇన్‌చార్జి పాలన సాగింది. కార్యాలయ ఏవో ఎస్.రమేష్ రెడ్డి ఇప్పటివరకూ ఇన్‌చార్జ్ ఎంపీడీవోగా విధులు నిర్వహించారు. ఆయన కూడా కొద్ది రోజుల క్రితమే పెనుగొండకు బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో జిల్లా పరిషత్ నుంచి గంటా శ్రీనివాస్ ఏవోగా నియమితులయ్యారు.

సెలవులకు ఊరెళితే జాగ్రత్తలు తీసుకోండి

- కొవ్వూరు పట్టణ సీఐ విశ్వం



కొవ్వూరు: దసరా సెలవులకు ఇంటికి తాళాలు వేసి పొరుగూర్లు వెళ్లే వారు దొంగతనాలకు ఆస్కారం లేకుండా తమ విలువైన ఆభరణాలు, డబ్బు జాగ్రత్త చేసుకోవాలని పట్టణ సీఐ పి.విశ్వం సూచించారు. పట్టణ పోలీసుస్టేషన్‌లో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు దసరా సెలవుల్లో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశామన్నారు. రాత్రిపూట అనుమానంతో సంచరించే వారి గురించి పోలీసులకు సమాచారం అందించాలన్నారు. తాళం వేసి ఉన్న ఇళ్లను ఉదయం పూట వెతుకుతున్నట్టు ఎవరైనా కనిపిస్తే పోలీసుల దృష్టికి తీసుకు రావాలన్నారు. ఇంట్లో మహిళలు ఉన్నప్పుడు ఎవరైనా అపరిచిత వ్యక్తులు సమాచారం కావాలంటూ వస్తే నమ్మవద్దన్నారు. ఆర్థిక స్థోమత ఉన్న వారు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవడం మంచిదన్నారు. లాక్డ్ మేనేజ్‌మెంట్ సిస్టమ్ అమర్చుకుంటే ఊరు వెళ్లినపుడు దొంగతనాలకు ఆస్కారం ఉండదన్నారు. దసరా సందర్భంగా పెద్ద కంపెనీల పేరుతో సైబర్ నేరగాళ్లు డూప్లికేట్ ఐడీలు క్రియేట్ చేసి మోసగించే అవకాశం ఉంటుందని సీఐ హెచ్చరించారు. లాటరీ, గిఫ్టులు, కారు, బైక్ తగిలిందంటూ వచ్చే మెసేజీల ద్వారా వచ్చే లింకులను ఓపెన్ చేయవద్దని సూచించారు. సైబర్ నేరానికి గురైనవారు వెంటనే 1930 నంబర్‌కు కాల్ చేయాలని సీఐ విశ్వం సూచించారు.

మహిళల కోసం కొవ్వూరులో న్యాయ శిబిరం

కొవ్వూరు: స్థానిక ఏబీఎస్ అండ్ పీఆర్ఆర్ కళాశాలలో శనివారం జాతీయ కమిషన్ మహిళల కోసం న్యాయ శిబిరాన్ని నిర్వహించారు. మండల లీగల్ సర్వీసెస్ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ శిబిరంలో మహిళలు గృహ హింసకి గురైనపుడు ధైర్యంగా పోలీసు అధికారులను సంప్రదించాలని చైర్ పర్సన్, ఫోర్త్ అడిషనల్ జిల్లా జడ్జి (తణుకు) డి.సత్యవతి సూచించారు. గ్రామాల్లో మహిళలకు అవగాహన కల్పించడంలో అంగన్‌వాడీ కార్యకర్తలు కీలక పాత్ర పోషించాలని సూచించారు. కొవ్వూరు ఆర్డీవో రాణి సుస్మిత, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి జి.సాయికృష్ణ, సెకండ్ అడిషనల్ జడ్జి, ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ కె.నాగలక్ష్మి, కొవ్వూరు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు యాగంటి చలపతి రావు, న్యాయవాదులు పాల్గొన్నారు.

ఎంపీడీవో కార్యాలయ సూపరింటెండెంట్‌గా నిర్మల

తాళ్లపూడి: స్థానిక మండల పరిషత్ కార్యాలయ సూపరింటెండెంట్‌గా పి.నిర్మల శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఆమె చాగల్లు మండలం నుంచి బదిలీపై ఇక్కడకు వచ్చారు. గతంలో ఇక్కడ పనిచేసి వెళ్లిన ఆర్.సత్యనారాయణ కూడా ఈ కార్యాలయ సీనియర్ అసిస్టెంట్‌గా ఇక్కడ విధుల్లో చేరారు. ఎంపీపీ జొన్నకూటి పోశిరాజు వారికి అభినందనలు తెలిపారు.

అన్నపూర్ణాదేవి.. నిను అర్చింతుమమ్మా..


దేవరపల్లి మండలం బందపురం కోదండ రామాలయంలో అన్నపూర్ణాదేవిగా దుర్గాదేవి


నిడదవోలు రజక వీధిలో దుర్గ భవాని దీక్ష పీఠం ఆధ్వర్యంలో పూజలు చేస్తున్న భవానీలు


తాళ్లపూడిలో అన్నపూర్ణాదేవి అలంకరణలో అమ్మవారు


అన్నపూర్ణా దేవిగా చాగల్లు మండలం బ్రాహ్మణగూడెం దేవత నాగారమ్మ

దేవరపల్లి: శరన్నవరాత్ర ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. దుర్గామాతను రోజుకొక రూపంలో అలంకరించి భక్తులు పూజలు చేస్తున్నారు. శనివారం అమ్మవారు అన్నపూర్ణాదేవి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. పలు ఆలయాల వద్ద మహిళలు అమ్మవారికి కుంకుమ పూజలు నిర్వహించారు. దేవరపల్లిలోని బాలదుర్గమ్మ అమ్మవారిని, మూడు బొమ్మల సెంటర్లోని సౌభాగ్య దుర్గాంబికా దేవిని, బందపురం గ్రామంలోని కోదండ రామాలయం వద్ద ప్రతిష్ఠించిన దుర్గాదేవి శనివారం అన్నపూర్ణాదేవి అవతారంలో భక్తులకు దర్శన మిచ్చారు. అమ్మవారికి మహిళలు భక్తిశ్రద్ధలతో కుంకుమ పూజలు చేశారు. ఆదివారం ఉదయం 9 గంటలకు దేవరపల్లి బాలదుర్గమ్మ అమ్మవారి ఆలయం వద్ద చండీ హోమం నిర్వహిస్తున్నట్టు ఆలయ కమిటీ ప్రతినిధులు తెలిపారు.

నిడదవోలు: శరన్నవరాత్ర ఉత్సవాలతో పట్టణం శోభాయమానంగా వెలుగొందుతోంది. మహిళలు అత్యంత భక్తి శ్రద్ధలతో అమ్మవారి మంటపాల వద్ద సామూహిక కుంకుమ పూజలు చేస్తున్నారు. స్థానిక రజక వీధి, భీమదొర తూము వద్ద గల కనకదుర్గమ్మ వారిని దుర్గా భవానీ దీక్ష పీఠం ఆధ్వర్యంలో అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. అమ్మవారు శనివారం అన్నపూర్ణాదేవి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. 16 రకాల పదార్థాలతో అమ్మవారికి నైవేద్యాలు సమర్పించారు. ఇక్కడ 40 మంది భవానీలు రోజూ అమ్మవారికి భక్తి శ్రద్ధలతో పూజలు చేస్తున్నారు. కార్యక్రమంలో దుర్గా భవానీ దీక్షా పీఠం సభ్యులు పాల్గొన్నారు. పట్టణ నడిబొడ్డున గల నంగాలమ్మ పూరి గుడి వద్ద మహిళా భక్తులు కుంకుమ పూజలు చేశారు. భవానీలు ప్రత్యేక భజనలు, నృత్యాలు చేశారు. అమ్మవారు అన్నపూర్ణాదేవి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు.

తాళ్లపూడి: స్థానిక నవదుర్గ, శ్రీచక్ర సహిత కనకదుర్గమ్మ ఆలయంలో అమ్మవారిని అన్నపూర్ణాదేవిగా అలంకరించారు. అర్చకుడు అల్లూరి శివప్రసాద్ ఆధ్వర్యంలో అమ్మవారికి పూజలు నిర్వహించారు. స్థానిక అయ్యప్పస్వామి ఆలయ ప్రాంగణంలోని శ్రీగాయత్రీ దేవి ఆలయంలోను, మలకపల్లిలోని కనకదుర్గమ్మ ఆలయంలోను ప్రత్యేక పూజలు చేశారు. వేగేశ్వరపురంలోని దుర్గాసాయిరామ్ మేదర సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో కనకదుర్గమ్మకు పూజలు చేశారు. వేంకటేశ్వరస్వామి ఆలయం వద్ద తాళ్లపూడి, గజ్జరం, అన్నదేవరపేట, తాడిపూడి, పైడిమెట్ట తదితర గ్రామాల్లో ఉత్సవాలు నిర్వహిస్తున్నారు.

చాగల్లు: స్థానిక మాతంగి చెరువు గట్టుపై గల కనకదుర్గమ్మ వారిని గాయత్రీదేవిగా అలంకరించారు. భక్తులు కుంకుమ పూజలు నిర్వహించారు. గ్రామ దేవత పాటమ్మ వారిని సుందరంగా అలంకరించారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. మహాలక్ష్మమ్మ గుడిలో మహిళలు కుంకుమ పూజలు చేశారు. వాసవీమాత గుడిలో అమ్మవారిని సుందరంగా అలంకరించారు. మీనానగరంలోని ముత్యాలదిబ్బ వద్ద గల అమ్మవారికి భవానీలు, మహిళలు పూజలు చేశారు. బ్రాహ్మణగూడెంలో నాగారమ్మ వారి ఆలయంలో భజన చేశారు. మహిళలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారిని అన్నపూర్ణా దేవిగా సుందరంగా అలంకరించారు. రావుల చెరువుగట్టుపై గల కనకదుర్గమ్మ వారికి విశేష పూజలు నిర్వహించారు. భవానీ మాలధారులు పూజలు నిర్వహించారు. ఊనగట్ల బీసీ కాలనీలో కనకదుర్గమ్మ ఆలయంలో మహిళలు కుంకుమ పూజలు చేశారు.

కోట సత్తెమ్మా.. ప్రణమామ్యహం

- 219 మంది దంపతులచే సహస్ర నామ కుంకుమ పూజలు
- అమ్మవారికి రూ.1.06 లక్షల ఆదాయం


కోటసత్తెమ్మ ఆలయంలో సహస్ర నామ కుంకుమ పూజలు చేస్తున్న భక్తులు

నిడదవోలు రూరల్: దేవీ నవరాత్ర ఉత్సవాల్లో భాగంగా తిమ్మరాజుపాలెంలో కొలువైన కోటసత్తెమ్మ వారి ఆలయానికి మూడో రోజు శనివారం భక్తులు భారీ ఎత్తున తరలివచ్చారు. అమ్మవారికి ఆలయ ప్రాంగణంలో 219 మంది దంపతులు సహస్రనామ కుంకుమ పూజలతో పాటు చండీ పారాయణ, హోమాలు నిర్వహించారు. అమ్మవారికి వివిధ రూపాల్లో రూ.1,05,527 ఆదాయం వచ్చినట్టు ఆలయ ఈఓ, అసిస్టెంట్ కమిషనర్ వి.హరి సూర్యప్రకాశ్ చెప్పారు. కోటసత్తెమ్మ వారిని విశేష స్వర్ణాభరణాలతో అలంకరించారు. అలాగే మండలంలోని తాడిమళ్లలోని మహాలక్ష్మి అమ్మవారికి ప్రత్యేక పుష్పాలంకరణ చేశారు. గోపవరం గుబ్బల మంగమ్మ, సమిశ్రగూడెంలోని పుంతలో ముసలమ్మ ఆలయాల వద్ద భక్తులు కుంకుమ పూజలు చేశారు. లోహియా నగర్‌లో కనకదుర్గమ్మ, కోరుమామిడిలోని అమ్మేపల్లిలో వీరాంజనేయ సహిత రాజరాజేశ్వరిస్వామి ఆలయాల వద్ద భక్తులు, భవానీలు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఉద్యాన వర్సిటీని సందర్శించిన విద్యార్థులు

నల్లజర్ల: వెంకట్రామన్నగూడెంలోని డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన యూనివర్సిటీని శనివారం నల్లజర్లలోని ఏకే ఆర్జీ డిగ్రీ కళాశాల బోటనీ, జువాలజీ, మైక్రో బయాలజీ విభాగాల విద్యార్థులు సందర్శించారు. ఈ కార్యక్రమాన్ని డాక్టర్ దీప్తి, డాక్టర్ ప్రసాదరెడ్డి, డాక్టర్ చిరంజీవి, డాక్టర్ సతీష్, డాక్టర్ రాఘవేంద్ర బృందం పర్యవేక్షించింది. పుట్టగొడుగులు, తేనెటీగలు, పెరటికోళ్ల, చేపల పెంపకం, నైపుణ్య శిక్షణ, సమీకృత వ్యవసాయ విధానాలు, పాడి పశువుల యాజమాన్యం, పశుగ్రాసాల సాగు, ఎక్వేరియంలో చేపల అలంకరణ, జీవన ఎరువుల తయారీ, చిరు ధాన్యాలతో విలువ ఆధారిత ఉత్పత్తుల తయారీ వంటి యూనిట్లను విద్యార్థులు సందర్శించి ప్రయోగ పూర్వకంగా తెలుసుకున్నారు. ఉద్యాన పరిశోధనా స్థానంలో కూరగాయల నారు పెంపకం, అలంకరణ మొక్కల ప్రవర్ధనం వంటి విషయాలను అధ్యయనం చేశారు. విశ్వవిద్యాలయం మ్యూజియాన్ని సందర్శించి వివిధ నూతన వంగడాల వివరాలు, పండ్లు, కూరగాయల ప్రాసెసింగ్, నిల్వ విధానాలపై అవగాహన పెంచుకున్నారు. కృషి విజ్ఞాన కేంద్ర ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ కరుణశ్రీ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం సాగింది.

యువతి అదృశ్యంపై కేసు నమోదు


మిరియాల సిరి(ఫైల్)

కొవ్వూరు: మండలంలోని దొమ్మేరు గ్రామంలోని ఇందిరమ్మ కాలనీకి చెందిన మిరియాల సిరి అనే యువతి ఈ నెల 3వ తేదీ నుంచి అదృశ్యమైంది. తన కుమార్తె కనిపించడం లేదంటూ ఆమె తండ్రి జగజ్జీవన్ రావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు శనివారం కేసు నమోదు చేసినట్టు కొవ్వూరు పట్టణ సీఐ పి.విశ్వం తెలిపారు. మూడో తేదీ మధ్యాహ్నం రెండు గంటలకు ఇంటి నుంచి బయటకు వెళ్లిన సిరి మళ్లీ తిరిగి రాలేదన్నారు. పలుచోట్ల వెతికినప్పటికీ ఆచూకీ లభ్యం కాకపోవడం ఆమె తండ్రి ఫిర్యాదు చేసినట్టు సీఐ తెలిపారు. ఆచూకీ తెలిసిన వారు 94407 96622 నంబర్‌కు కాల్ చేయాలని ఆయన సూచించారు.

వాడపల్లి ఇసుక ర్యాంపు పరిశీలించిన ఆర్డీవో


వాడపల్లి ఇసుక ర్యాంపులో సిబ్బందిని వివరాలు అడిగి తెలుసుకుంటున్న ఆర్డీవో రాణి సుస్మిత

కొవ్వూరు: మండలంలోని వాడపల్లి డీ సిల్టేషన్ ఇసుక ర్యాంపులో ఇసుక బుకింగ్, రవాణా వ్యవస్థను కొవ్వూరు ఆర్డీవో రాణి సుస్మిత శనివారం పరిశీలించారు. ఈ ర్యాంపులో 43 ఆర్డర్లకు గాను శనివా రం 731 మెట్రిక్ టన్నుల ఇసుక అందుబాటులో ఉందని తెలిపారు. బుకింగ్ విధానం పరిశీలన, రికార్డుల నిర్వహణపై ఆర్డీవో ఈ సందర్భంగా ఇక్కడి సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఇసుక రవాణాలో ప్రభుత్వం నిర్దేశించిన మార్గదర్శకాలను విధిగా పాటించాలని ఆమె సూచించారు. బోట్స్‌మెన్ సొసైటీ ద్వారా గతంలో ర్యాంపుల్లో ఉన్న నిల్వ ఇసుక తరలించామని ఇంతవరకూ బిల్లులు చెల్లించలేదని బోట్ల నిర్వాహకులు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ ఆర్డర్ మేరకు ఇటీవల పెద్దాపురానికి ఇసుక తరలించినప్పటికీ బిల్లులు అందలేదని వివరించారు. ర్యాంపు ప్రారంభం అయినప్పటి నుంచి ఇంతవరకూ బోట్స్‌మెన్ సొసైటీలకు బిల్లులు చెల్లించనందున బోట్ల నిర్వహణ భారంగా మారిందని పలువురు నిర్వాహకులు ఆర్డీవో దృష్టికి తీసుకొచ్చారు. వాడపల్లి ర్యాంపులో రోజుకు 400 లారీల ఇసుక తరలించే సామర్థ్యం ఉన్నప్పటికీ, ఎలాట్‌మెంట్ తక్కువ పెడుతున్నారన్నారు. కనీసం రోజుకు నాలుగైదు వేల టన్నుల ఎలాట్‌మెంట్ పెట్టేలా చర్యలు తీసుకోవాలని పడవల యజమానులు కోరారు.

కోర్టు భవనాలకు అనువైన స్థలాల పరిశీలన

కొవ్వూరు, నిడదవోలు పట్టణాల్లో జూనియర్ సివిల్ జడ్జి కోర్టు భవనాలు, నివాస గృహాల నిర్మాణానికి అనువైన స్థలాలను పరిశీలించినట్టు ఆర్డీవో రాణి సుస్మిత తెలిపారు.